ప్రజాశక్తి

బుధవారం 18 జనవరి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

స్థానిక ఎన్నికలపై తొలగని అడ్డంకులు

- నాలుగు పట్టణాల్లో ప్రత్యేక అధికారుల పాలన
- అమరావతి పల్లో.. పట్టణమో తెలియక అయోమయం
- ప్రజా ప్రతినిధులను ఎన్నుకోలేని రాజధాని వాసులు
- మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌తో పాటు పొన్నూరు, బాపట్ల, నర్సరావుపేటలో దుస్థితి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



ఎన్నికలు నిర్వహించాల్సిన బాపట్ల మున్సిపల్ కార్యాలయం

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 3 మున్సిపాల్టీలకు మంగళగిరి-తాడేపల్లి మునిసిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు ఎప్పటికి జరుగుతాయన్నది ఆయా ప్రాంత వాసులకు అంతుబట్టడం లేదు. 2021లో మార్చిలో గుంటూరు కార్పొరేషన్ సహా మరో ఆరు మున్సిపాల్టీలకు ఎన్నికలు జరిగాయి. 2022 ఏప్రిల్‌లో జిల్లా, మండల పరిషత్‌లకు ఎన్నికలు జరిగాయి. ఫలితాలు మాత్రం 2022 సెప్టెంబరులో వెలువడ్డాయి. పెండింగ్‌లో ఉన్న గురజాల, దాచేపల్లి నగర పంచాయతీలకు 2021 అక్టోబరు 15న ఎన్నికలు నిర్వహించారు. ఇదే సమయంలో స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించారు. కానీ పొన్నూరు, బాపట్ల, నర్సరావుపేట మున్సిపాల్టీలకు మంగళగిరి - తాడేపల్లి కార్పొరేషన్‌కు ఎన్నికలు ఇంకా నిర్వహించలేదు. తుళ్లూరు మండలాన్ని మున్సిపాలిటీగా మార్చాలనే ప్రతిపాదనతో ఈ మండలంలో ఎన్నికలు జరగలేదు. రాజధాని ప్రాంతంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగకపోవడంతో ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకోలేకపోయారు.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 57 జెడ్‌పిటిసిలకు గాను 54కు

▸ 2లో

పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీచట్టం

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు, యాత్రీకరణ వల్ల వ్యసాయంలో కూలీలకు పనులు బాగా తగ్గాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. ఉపాధి హామీ కింద ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రూ.600 కూలి ఇవ్వాలని, వీటితోపాటు పట్టణ ప్రాంతాల్లోనూ ఈ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, కేరళ, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పట్టణ ఉపాధి హామీ అమలవుతోందని గుర్తు చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి బుధవారం వచ్చిన ఆయన స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. వ్యవసాయంలో గతంలో 120 రోజులు పనులుంటే ఇప్పుడు 60 రోజులకు పడిపోయాయని, దీంతో కూలీలు ఇతర రాష్ట్రాలకు వలసెళ్తున్నారని చెప్పారు. ఇదే క్రమంలో ఉపాధి హామీ కింద గతంలో 60-70 పనిదినాలు కల్పించగా ఇప్పుడు 40 రోజులకు మించి చూపడం లేదని, రోడ్లు, డ్రెయినేజీలు, భవనాల్లో ఉపాధి హామీ నిధులు వాడుతూ యంత్రాలతో పనులు చేయిస్తున్నారని విమర్శించారు. వీటిల్లోనూ పెద్దఎత్తున అవినీతి నెలకొందన్నారు. జగనన్న కాలనీలంటూ ప్రభుత్వం తీసుకున్న భూముల్లో సగం దళితులవేనని, ఆ భూములకు 2013 భూ సేకరణ చట్టం ద్వారా జిరాయితీ భూములకు ఇచ్చినట్లు పరిహారం ఇవ్వడం లేదని అన్నారు. యడవల్లి లాంటి చోట్ల దళితులకు ఇచ్చిన భూముల్లోనూ అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ సమస్యలన్నింటిపైనా సంఘం పోరాడుతుందని, అందులో భాగంగా ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమంలో దళితులు, వ్యవసాయ కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వలస పక్షుల్లా వ్యవసాయ కార్మికులు 4లో

మిర్చి యార్డులో పెరిగిన రద్దీ

రాయలసీమ, పల్నాడు నుండి సరుకు



2లో

8500 టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో 2022-23 సంవత్సరంలో 37 వేల మెట్రిక్ టన్నుల ధాన్య సేకరణ లక్ష్యం తాత్కాలికమేనని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజరు జి.లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో ఈనెల 15న 'ధాన్యం కొనుగోలు మందగమనం' శీర్షికన వచ్చిన వార్తకు ఆమె స్పందించారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 1100 మంది రైతుల నుంచి 8500 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. 600 మంది రైతుల ఖాతాల్లో రూ.7.18 కోట్ల సొమ్ము జమ చేసినట్టు తెలియజేశారు. రైతులు ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులొస్తే కంట్రోలురూమ్ నంబరు 9491392717కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నాలో నాయకులు

- అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు
- అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత, గిరిజన, ప్రజా సంఘాల ధర్నా

ప్రజాశక్తి - గుంటూరు

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత, గిరిజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా కుల వివక్షత వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ

▸ 2లో

స్థానిక ఎన్నికలపై తొలగని అడ్డంకులు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికలు జరిగాయి. తాడేపల్లి, మంగళగిరి, తుళ్లూరు జెడ్‌పిటిసి స్థానాలకు 2020లోనే నోటిఫికేషన్ ఇవ్వలేదు. తరువాత మంగళగిరి, తాడేపల్లి పట్టణాలు, పలు గ్రామాలు కలిపి కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని 21 గ్రామాలను కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే ఇచ్చింది. మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్‌లో 50 డివిజన్లు చేయాలని అధికారులు ఇప్పటికే ప్రతిపాదించారు. హైకోర్టు స్టే ఉత్తర్వులతో ఈ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగలేదు. పొన్నూరు, బాపట్ల, నర్సరావుపేట మున్సిపాల్టీల్లో పరిసర గ్రామాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ కూడా పలువురు కోర్టును ఆశ్రయించారు. మూడు మున్సిపాల్టీలకు కూడా ఎన్నికలు నిర్వహించలేదు. మొత్తం మీద ఉమ్మడి గుంటూరు జిల్లాలో మూడు మునిసిపాలిటీలు,మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్‌లో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయన్నదీ ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు రాజధాని ప్రాంతంలో మొత్తం 29 గ్రామాలు ఉండగా ఏడు గ్రామాలు మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ విలీనం చేయగా తుళ్లూరు మండలంలోని 19, మంగళగిరి మండలంలోని మూడు గ్రామాలు కలిపి అమరావతి మెట్రోపాలిటన్ నగరంగా రూపొందించాలని 2021లో ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలపై పలువురు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఆ ప్రతిపాదనను 22 గ్రామాల వారు వ్యతిరేకించారు. గతేడాది సెప్టెంబరులో అమరావతి మున్సిపాల్టీ ఏర్పాటు చేస్తూ ఇచ్చిన నోటిఫికేషన్‌పైనా గ్రామ సభల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. సెప్టెంబరు 12 నుంచి వారం రోజుల పాటు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో కూడా 22 గ్రామాలకు మున్సిపాల్టీని అంగీకరించబోమని గ్రామసభల్లో తీర్మానం చేశారు.

రాజధాని ప్రాంతం పల్లే... పట్టణమో అర్థంకానీ పరిస్థితి ఉందని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. రాజధానిలోని 29 గ్రామాలను కలిపి ఒక కార్పొరేషన్‌గా మారిస్తే అభ్యంతరం లేదని కానీ రాజధాని ప్రాధాన్యతను తగ్గించేందుకు ఐదు గ్రామలను తాడేపల్లి, మంగళగిరి మున్సిపాల్టీల్లో విలీనం చేయడాన్ని రైతులు తప్పుపడుతున్నారు. వాస్తవంగా తాడేపల్లి, మంగళగిరి మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించకుండా ఏదో కారణంతో వాయిదా వేయాలన్న తలంపుతో అధికార పార్టీ నాయకులు కూడా స్టే ఉత్తర్వుల తొలగింపునకు ప్రయత్నమేమీ చేయడంలేదనే విమర్శలు ఉన్నాయి. రాజధాని మార్పును వ్యతిరేకిస్తూ జరుగుతున్న ఉద్యమం ప్రభావం ఈ రెండు పట్టణాలపై తీవ్రంగా ఉంటుందని భావిస్తున్నారు.

ముగ్గుల పోటీలు నిలిపివేత

ప్రజాశక్తి - వినుకొండ: శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను 16వ తేదీ సోమవారం సాయంత్రం పోలీసులు అడ్డుకున్నారు. వేల్పూరు గ్రామ టిడిపి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తుండగా మైక్ అనుమతులు లేవంటూ శావల్యాపురం పోలీసులు నిలిపివేశారు. ప్రతి ఏటా సాంప్రదాయబద్ధంగా వేల్పూరు గ్రామంలో ముగ్గుల పోటీలు సంక్రాంతి సందర్భంగా కనుమ రోజు నిర్వహించి ఎన్టీఆర్ వర్ధంతి జనవరి 18న విజేతలకు బహుమతులు ప్రధానం చేయడం ఆనవాయితీ వస్తుంది. అయితే ఈ ఏడాది కూడా ముగ్గుల పోటీలు నిర్వహిస్తుండగా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగించడానికి వీలు లేదంటూ పోలీసులు అడ్డుకోవడంతో టిడిపి నాయకులకు పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. భారీ సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చి ప్రత్యేక ముగ్గుల పోటీలను నిలిపివేయడం సరికాదని చెప్పినప్పటికీ పోటీలు నిబంధనలకు విరుద్ధమని నిలిపివేయడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. వైసిపి వర్గీయులు ముగ్గుల పోటీలను కావాలనే ఉద్దేశపరంగా పోలీసులను అడ్డుపెట్టుకొని నిలిపివేయించారని టిడిపి వర్గీయులు ఆరోపించారు. గ్రామంలో ఎప్పుడు లేని విధంగా ఏడాది అధికార పార్టీ, పోలీసులు వ్యవహరించిన తీరుకు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయం భారమై..'సంక్రాంతి'కి దూరమై...

- **నాలుగేళ్లుగా రైతులకు నష్టాలు..**
- **ఏడాదికేడాదికీ పెరుగుతున్న అప్పులు**
- **రైతుల్లో నైరాశ్యం**
- **సంక్రాంతి సంబరాలను బహిష్కరించిన చందలూరు ప్రజలు**



చందలూరు గ్రామంలోని ప్రధాన వీధి

ప్రజాశక్తి-పంగులూరు

సంక్రాంతి పండుగ అనగానే 15 రోజుల ముందు నుంచే ఒకప్పుడు ఆ గ్రామంలోనూ వాతావరణం కనిపించేది. కొత్త అల్లుళ్ల అత్తవారింటికి రావడం, బంధు, మిత్రులు రావడం, ఇళ్లల్లో రకరకాల పిండి వంటలు తయారు చేయడంలో మహిళలు నిమగ్నమవటం, తొమ్మిది రోజుల పాటు అనేక కళలకు సంబంధించి రోజూ ఒక కార్యక్రమం నిర్వహించడం.. గతంలో ఆ ఊరి ప్రత్యేకత.. కానీ నేడు ఆ పరిస్థితి కనపడలేదు. ప్రస్తుతం ఆ గ్రామంలో సంక్రాంతి ఊసే లేదు. సంబరాలు లేవు, ఆటపాటలు లేవు, కళారూపాలు లేవు, అసలు పండగ వాతావరణమే కనిపించలేదు. గ్రామం మొత్తం సంక్రాంతి పండుగను బహిష్కరించిన పరిస్థితి. అదే.. పంగులూరు మండలంలోని చందలూరు గ్రామం.

చందలూరు గ్రామంలో జనాభా సుమారు 4 వేల వరకు ఉంటుంది. ఈ గ్రామానికి 3,500 ఎకరాల భూమి ఉంది. మొత్తం నల్లరేగడి భూమి. పూర్తిగా వర్షాధారమైన ఆధారపడే ఈ భూమిలో, వాణిజ్య పంటలైన మిర్చి, శనగ, మినుము, పత్తి వంటి పంటలు ఇక్కడ సాగు చేస్తారు. ఇక్కడ ప్రతి కుటుంబం వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతుంటారు. మండలంలోని వ్యవసాయ పంటలు సాగులో ఒకప్పుడు ఈ గ్రామం అగ్రగామిగా నిలిచింది. ఇక్కడ తెలుగువారికి ప్రీతిపాత్రమైన సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించేవారు. సంక్రాంతికి ముందు తొమ్మిది రోజుల పాటు రోజుకు ఒక కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించేవారు. బుర్రకథ, హరికథ, చెక్కభజన, కోలాటం, నాటికలు మొదలైన వాటిని ప్రతిరోజూ నిర్వహించడంతో.. గ్రామస్తులంతా ఐక్యంగా ఈ కార్యక్రమానికి హాజరై సంబరాల్లో పాల్గొనేవారు. గ్రామంలోని పెంట్యాల గోవిందయ్య కళా నిలయం దగ్గర భోగి పండుగ, సంక్రాంతి పండుగ, కనుమ... ఈ మూడు రోజులు అనేక కార్యక్రమాలు ఆహ్లాదభరితంగా జరుపుకునేవారు. ఉట్టి పగలగొట్టడం, ముగ్గుల పోటీలు, సైకిలు, డాక్టర్ స్లో పోటీలు, చిన్నపిల్లలు చేత సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేవి. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి మహాలక్ష్మమ్మ అమ్మవారి కొలుపులు, తొమ్మిది రోజులు సేవా ప్రభల ఊరేగింపు, నాటకాలు, భజన కార్యక్రమాలు జరిగేవి. గ్రామ ప్రజలంతా పండుగలో పాలుపంచుకునేవాళ్లు. అలాంటిది ప్రస్తుతం ఆ గ్రామంలో సంక్రాంతి సంబరాలు లేవు. ఆటపాటలు లేవు. ప్రజల్లో ఉత్సాహం లేదు. నాలుగేళ్లుగా వర్షాలు లేక ఒకసారి, అధిక వర్షాలు కురిసి ఒకసారి, మిర్చికి తామర పురుగు సోకి ఒకసారి, బొబ్బర వల్ల ఒకసారి, ఇలా ప్రతిఏటా మిర్చి సాగు చేసిన రైతులు నష్టపోతూ వచ్చారు. శనగలకు సరైన ధరలు లేక కోల్డ్‌స్టోరేజీల్లో మగ్గుతున్నాయి. పంట నష్టపరిహారాలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ ఊసే ఎత్తలేదు. ప్రభుత్వ సహకారం లేక, పంటల సక్రమంగా పండక.. అప్పులు రోజురోజుకూ పెరిగిపోతూ రైతాంగంలో నైరాశ్యం కనిపిస్తోంది. ఏడాదికేడాదికీ అప్పులు పెరిగిపోతున్నాయి. కనీసం పెట్టుబడులు కూడా రాక ప్రతి కుటుంబం ఇబ్బందులు పడుతోంది. ఈ పరిస్థితుల్లో సంక్రాంతి పండుగ జరుపుకోవాలనే ఆసక్తి కూడా గ్రామ ప్రజల్లో సన్నగిల్లిపోయింది. ఈ ఏడాది సంక్రాంతి పండుగ వాతావరణం గ్రామంలో కనిపించలేదు. సంక్రాంతి సంబరాలు జరిగే పెంట్యాల గోవిందయ్య కళానిలయం బోసిపోయింది. గ్రామంలో ఎక్కడా సంక్రాంతి సంబరాలు జరగలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా వర్షాధారం, నీటిపారుదల అనే నిబంధనలను పక్కనపెట్టి, వ్యవసాయంలో నష్టపోయిన మిర్చి రైతులందరికీ నష్టపరిహారం అందించాలని, కోల్డ్ స్టోరేజీల్లో మగ్గుతున్న రైతుల సరుకును కొనుగోలు చేయించాలని, అప్పుడే రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడి పండుగలను సంతోషకరంగా, జరుపుకుంటారని రైతులు చెబుతున్నారు.



బోసిపోయిన చందలూరులోని పెంట్యాల గోవిందయ్య కళానిలయం.

మిర్చి యార్డులో పెరిగిన రద్దీ

రాయలసీమ, పల్నాడు నుండి సరుకు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో మంగళవారం రద్దీ పెరిగింది. మూడ్రోజుల సెలవులు అనంతరం యార్డులో మళ్లీ లావాదేవీలు తిరిగి ప్రారంభం అయ్యాయి. మంగళవారం 55,670 టిక్కీలు రాగా పాత నిల్వలతో కలిపి 52,402 టిక్కీలు అమ్ముడుపోయాయి. పాత నిల్వలతో కలిపి ఇంకా 33,798 టిక్కీలు నిల్వ ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇటీవల కళ్లాల్లో ఆరబెట్టిన మిరప కాయలు యార్డుకు వస్తున్నాయి. ధరలు నిలకడగా ఉన్నాయి. గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి మిర్చి రావడం ప్రారంభం అయింది. ఇప్పటి వరకు రాయలసీమ ప్రాంతం నుంచి రాగా తాజాగా పల్నాడు జిల్లా నుంచి ఎక్కువగా సరుకు వస్తోంది.

మిర్చి యార్డులో మంగళవారం లభించిన సగటు ధరలు ఇలా ఉన్నాయి. నాన్ ఎసి కామన్ వెరయిటీ కనిష్ట ధర క్వింటాళ్ రూ.9,500 ఉండగా గరిష్ట ధర రూ.26 వేలుగా వచ్చిందని అధికారులు తెలిపారు. బాడిగ రకం కనిష్ట ధర రూ.11 వేలు, గరిష్ట ధర రూ.27,500 పలికింది. మేలు రకమైన నంబరు 5 వెరైటీ క్వింటాళ్ రూ.26 వేలు, 334 రకం క్వింటాళ్ రూ.26 వేలు గరిష్టంగా లభించింది. స్పెషల్ వెరైటీ తేజ కనిష్ట ధర రూ.8 వేలు లభించగా, గరిష్ట ధర రూ.24,500 లభించింది. దేవనూరు డీలక్స్ గరిష్ట ధర రూ.27,500 పలికింది.





ధ్యాన కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఉదయభాను

గౌతమ బుద్ధ ధ్యాన కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని చెరువు బజార్ రోడ్డు బుద్ధ విహార్ పార్క్ వద్ద మంగళవారం గౌతమ బుద్ధ ధ్యాన కేంద్ర నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, హిమాలయ యోగి సంపత సదానంద గిరి మహారాజ్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ఈ రోజు ప్రజలు జీవితంలో అనేక రకాల ఒత్తిడి, ఆర్థిక సమస్యలు చుట్టుముట్టినప్పుడు ఒత్తిడిని ఎదుర్కోవడానికి, జీవితంలోని సవాళ్లను ఎదుర్కోవడానికి ధ్యానం సహాయపడుతుందన్నారు. బుద్ధ విహార్ ఉన్న చెరువును సుమారు రూ. 5 కోట్లతో చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి అలాగే గ్రీనరీ, లైట్లుతో మంచి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. పోస్ట్ ఆఫీస్ రోడ్డులో గల చారుగుండ్ల కొండ కాంప్లెక్స్‌లో పట్టణ ముస్లిం మైనారిటీ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆసిఫ్ అలీతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ముస్లింలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకొని వారి సంక్షేమాన్ని వీడి మొండిచేయి చూపించాయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ మొయిద్దీన్, కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు రన్ హుసేన్, షాది ఖానా చైర్మన్ ఎక్స్టెడ్ భాషా, సొసైటీ అధ్యక్షులు బాల సైదా పాల్గొన్నారు.

నేడు ఎన్‌టిఆర్ వర్ధంతి సభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టి రామారావు 27వ వర్ధంతి సభ బుధవారం ఉదయం 9 గంటలకు గుంటూరులోని అరండల్ పేట జిల్లా టిడిపి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు పార్టీ ప్రచార కార్యదర్శి నాయుడు ఓంకార్ మంగళవారం మీడియాకు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్ బాబు, పార్టీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్, మాజీ మంత్రులు మాకినేని పెదరత్తయ్య, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ళ నరేంద్ర కుమార్, నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, టిడిపి నగర నాయకులు నసీర్ అహ్మద్, కోవెలమూడి రవీంద్ర పాల్గొంటారని తెలిపారు

సబ్‌ప్లాన్ చట్టాన్ని కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)

సబ్‌ప్లాన్ ప్రకారం ప్రభుత్వం కేటాయించిన నిధులు జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయించకపోవడం వలన గత ఐదేళ్లలో సుమారు రూ.96 వేల కోట్లు దళిత, గిరిజనులు నష్టపోయారని, కేటాయించిన నిధులు కూడా సాధారణ పథకాలకు ఎక్కువ నిధుల కేటాయించి, నేరుగా ఉపయోగపడే పథకాలకు నిధులు తక్కువ చేశారని చెప్పారు. సబ్‌ప్లాన్ కొనసాగింపుపై ముఖ్యమంత్రి, సాంఘిక సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శికి ఇప్పటికే లేఖలు పంపించామని, చట్టాన్ని తక్షణమే సవరించేందుకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 2013 జనవరి 23తో ఆంధ్రప్రదేశ్లోకి అమలులోనికి వచ్చిన ఈ చట్టం దశాబ్ధ కాలంగా ఆశించిన ఫలితాలు సాధించలేకపోయినదని, ఆర్థిక సామాజిక అభివృద్ధి సాధించడంలో విఫలమైందని తెలిపారు. కావున ఈ చట్ట స్ఫూర్తి కొనసాగించాలంటే తప్పనిసరిగా చట్టాన్ని శాశ్వతంగా కొనసాగించాలని కోరారు.

అందుకోసం తక్షణమే అసెంబ్లీ సమావేశాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి నూతన చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ దళిత, ఆదివాసీల ఆర్థిక అభివృద్ధికి దోహదపడే ఈ చట్టాన్ని గత ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేయకపోవడం వలన అనుకున్న లక్ష్యాలు సాధించలేదని, ఈ చట్టాన్ని కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు ధర్నాలో వివిధ సంఘాల నాయకులు బి.చిట్టిబాబు, ఎం.బాబురావు, పాశం రామారావు, ఎన్.కిషోర్, బి.లక్ష్మణరావు, బి.శ్రీనివాసరావు, నవీన్‌ప్రకాష్, జె.శ్రీకాంత్, పి.ప్రకాష్, సునీల్ కుమార్, చంద్రనాయక్, అనిల్, బి.విల్సన్, విజయ భాస్కర్, ఎ.కుమార్ పాల్గొన్నారు.

కొలకలూరులో పోలీసుల మొహరింపు

- యువకుడి ఆత్మహత్యతో గ్రామంలో ఉద్రిక్తత
- నిందితులను అరెస్ట్ చేయాలని ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి-తెనాలి

మండలంలోని కొలకలూరులో యువకుడి బలవన్మరణం ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన పొన్నెకంటి శ్యామ్‌సుందర్(22) వాలీబాల్ క్రీడాకారుడు. చుట్టపక్కల గ్రామాల్లో మంచి వాలీబాల్ క్రీడాకారుడిగా గుర్తింపు ఉంది. అలాగే రాడ్ బెండింగ్ వర్కర్ కూడా చేస్తుంటాడు. శ్యామ్ సుందర్‌కు అదే ప్రాంతానికి చెందిన గాజులవర్తి బాబు కుటుంబ సభ్యులతో గతంలో పాత కక్షలు ఉన్నట్లు సమాచారం.. ఈ నేపథ్యంలో పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని వారం క్రితం గాజులవర్తి బాబు, గాజులవర్తి ప్రేమ్‌సాగర్ అలియాస్ భన్ను, గాజులవర్తి రత్నకుమారి, మూల్పూరు రాజీవ్ గాంధి, మూల్పూరు మున్ని సమిష్టిగా దారికాచి శ్యామ్‌సుందర్‌పై దాడికి పాల్పడ్డారు. ఇరువురి నివాసాలు ఎదురెదురుగా ఉండటంతో మానసికంగా వేదింపులకు గురిచేశారు. తీవ్ర మనస్తాపానికి గురైన శ్యామ్ సుందర్ ఈనెల 14న పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నం చేశాడు. విజయవాడ ఓ ప్రైవేటు వైద్యశాల్లో చికిత్స పొందుతూ 16వ తేది తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు బంధుమిత్రుల్లో తీవ్రమైన ఆగ్రహావేశాలు నెలకొన్నాయి. రూరల్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబంలో తీవ్ర విషాదం...గ్రామంలో ఉద్రిక్తత..

శ్యామ్ సుందర్ మృతి ఆ కుటుంబంలోను, గ్రామంలోనూ తీవ్ర విషాదాన్ని నింపింది. దళిత సంఘాలు



కొలకలూరులో మొహరించిన పోలీసులు

జోక్యం చేసుకోవటం, నిందితుల అరెస్ట్‌కు డిమాండ్ చేయటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు భారీగా మొహరించారు. నిందితులను అరెస్ట్ చేస్తామని చెప్పటంతో పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా అంత్యక్రియలు ముగిశాయి. దీనిపై రూరల్ ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు వివరణ కోరగా పై తెలిపిన ఐదుగురు నిందితులతోపాటు మరి కొంతమందిపైనా కేసు నమోదు చేశామని, మిగిలిన నిందితుల కోసం గాలింపు జరుగుతుందన్నారు.

రాజు సుందరబాబు పై కేసు

ప్రజాశక్తి -ప్రత్తిపాడు : గుంటూరుకు చెందిన దళిత నాయకుడు గొళ్ళమూడి రాజు సుందర బాబు పై సోమవారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ ఆరోగ్య రాజు తెలిపిన వివరాల ప్రకారం గత ఏడాది మండలంలోని పెదగొట్టిపాడు గ్రామంలోని ఒక్కొక్కరికి రూ. 4 లక్షల 25 వేలు ఇప్పిస్తాను అని చెప్పి అందరి దగ్గర డబ్బులు వసూలు చేసి, తర్వాత వారిని పట్టించుకోకుండా పల్లెలోనే చీలిక చేసి కొంత మందికి మాత్రమే ఇప్పిస్తాను అని మిగిలిన వారిని మోసం చేశారని బాధితులు తెలిపారు. దాని గురించి ప్రశ్నించినందుకు మహిళలలు అని చూడకుండా అసభ్యంగా బూతులు తిడుతున్నారని వాపోయారు. ఈ నెల 10వ తేదీ గొళ్ళమూడి రాజు సుందర బాబు అతని వెంట తిరిగే మహిళలను తమపైకి రెచ్చగొట్టినట్లు పెదగొట్టిపాడు గ్రామ మాలపల్లెకి చెందిన జొన్నలగడ్డ జయభాగ్యం మరో 15 మంది కలిసి పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ప్రత్తిపాడు ఎస్ఐ ఆరోగ్యరాజు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీకి యత్నం

ప్రజాశక్తి-తాడేపల్లి

రాజధానిలో భాగమైన ఉండవల్లి కుమ్మరికుంట ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి ఇంటి ముందు పార్కు చేసిన వాహనాన్ని చోరీ చేసేందుకు దుండగులు ప్రయత్నించారు. అటుగా వెళ్తున్న యువకుడు గమనించి కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. బాధితుడు వేమా అనిల్ కథనం ప్రకారం... ఎప్పటిలాగానే తన ఇంటి ముందు తన పల్సర్ వాహనాన్ని పార్కింగ్ చేసి ఇంట్లో నిద్రపోయినట్లు తెలిపాడు. సుమారు 12 గంటల సమయంలో ముగ్గురు దొంగలు ద్విచక్ర వాహనాన్ని అపహరించడానికి ప్రయత్నించారని తెలిపారు. విజయవాడలో పనులు ముగించుకుని అటుగా వెళున్న ఓ యువకుడు గమనించి పెద్దగా కేకలు వేయడంతో తామంతా బయటకు వచ్చామని దీంతో దుండగులు వాహనాన్ని అక్కడే వదిలేసి వారు వచ్చిన ద్విచక్ర వాహనంపై ముగ్గురూ పారిపోయారని తెలిపారు. ఈ మేరకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు వేమా అనిల్ ఫిర్యాదు చేశాడు. తాడేపల్లి ఎస్ఐ వినోద్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

థియేటర్లో చోరీ

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : పట్టణంలోని శ్రీ లక్ష్మి థియేటర్లో చోరీ జరిగిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం సంక్రాంతి పండుగ సందర్భంగా బ్యాంకులు మూడు రోజుల సెలవు కావడంతో నగదును థియేటర్‌లోని లాకర్లో ఉంచినట్లు మేనేజర్ శ్రీహరి తెలిపారు. వాల్తేరు వీరయ్య, వీర నరసింహారెడ్డి సినిమాల మూడు రోజులు కలెక్షన్ నగదు మొత్తం చోరీ చేశారని సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	55,670
మిర్చి ఎగుమతి	:	52,402
మిర్చి నిల్వ	:	33,798

మిర్చి ధరలు

రూపాయలలో

334	10000 - 26000
నెం.5	12000 - 26000
273	10500 - 18500
341	9500 - 23000
4884	10000 - 17000
సూపర్-10	17000 - 19000
నాన్ ఎసి	
తేజ	8000- 24500
బడిగి	11000 - 27500
దేవనూరు డీలక్స్	11500 - 26000
తాలుకాయలు	4000 - 13000

కానిస్టేబుల్ అభ్యర్థులకు నేడు మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - నరసరావుపేట

పోలీస్‌కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమయే అభ్యర్థులకు బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మోడల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు భారత ప్రజాతంత్ర యువజన సంఘం (డివైఎఫ్ఐ) పల్నాడు జిల్లా కార్యదర్శి ఆంజనేయరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్ష స్థానిక వాసవి డిగ్రీ కళాశాలలో పరీక్ష ఉంటుందని, పరీక్ష అనంతరం వివిధ సందేహాలపై ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. అసలు పరీక్షకు మూడ్రోజులు ముందుగా నిర్వహించే ఈ పరిక్ష అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పరీక్షకు హాజరయ్యేవారు రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని, పరీక్ష కేంద్రంలోనే చెల్లించొచ్చని, మరిన్ని వివరాలకు 9573067224 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సబ్‌ప్లాన్ చట్టంపై నేడు రౌండ్ టేబుల్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టంపై స్థానిక పండరిపురంలోని ఏలూరి సిద్ధయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని జిల్లా సహాయ కార్యదర్శి ఎం.విల్సన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే సమావేశానికి దళిత, గిరిజన ప్రజా సంఘాలు, అభ్యుదయ వాదులు హాజరవ్వాలని కోరారు.

సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా కొనసాగించాలి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం శాశ్వతంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి తీర్మానం చేయాలని జై బీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్, న్యాయవాది జొన్నలగడ్డ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. సబ్‌ప్లాన్ చట్టం అమలులో ప్రభుత్వాల చిత్తశుద్ధి లోపం వల్ల అనుకున్న లక్ష్యాలు సాధించలేదని, జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయింపులు లేకపోవడం వల్ల గత ఐదేళ్లలో రూ.96 వేల కోట్లను ఎస్సీ, ఎస్టీలు నష్టపోవాల్సి వచ్చిందని అన్నారు. ఈ నేపథ్యంలో సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాల్సి ఉందని కోరారు. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బి.శ్రీనివాస్ యాదవ్, ఎం.సుధాకర్‌రావు, జె.కమల్‌కుమార్, ఎస్‌కె.జాని, షరీఫ్, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదార్ల నుండి ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - నరసరావుపేట

డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారుల నుండి ఈ నెల 19, 20, 21 తేదీల్లో ప్రజాభిప్రాయ సేకరూ చేపడతామని ఎడిఎ వై.ఏడుకొండలు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అంశాలను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక ఆదాయం అవసరాలు రిటైల్ ధరలపై విశాఖపట్నం నుంచి శాఖ ఉన్నతాధికారులు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో తెలియజేస్తామని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు బరంపేటలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద జరిగే బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. మూడ్రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకూ అభిప్రాయాలు సేకరిస్తామని తెలిపారు.

వలస పక్షుల్లా వ్యవసాయ కార్మికులు

- సాగు విస్తీర్ణమూ తగ్గి పనులు కరువు
- ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న పాలకులు
- సమస్యలపై పోరాటం : వ్య.కా.స

ప్రజాశక్తి-సత్తెనపల్లి



విలేకర్లతో మాట్లాడుతున్న దడాల సుబ్బారావు పక్కన లక్ష్మీశ్వరరెడ్డి, రోశయ్య

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో వ్యవసాయ కార్మికులు వలస పక్షుల్లా అయిపోయారనివ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు ఆవేదన వెలిబుచ్చారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి బుధవారం వచ్చిన ఆయన స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా వాణిజ్య పంటల సాగును పాలకవర్గాలే ప్రోత్సహిస్తున్నారని, వీటిల్లో ఎక్కువగా యాంత్రీకరణ పెరిగి కూలీలకు పనులు సగానికి సగం తగ్గాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఉపాధి కోసం కూలీలు ఇతర రాష్ట్రాలకు లక్షలాదిగా తరలివెళ్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని సరిగా అమలు చేయని పాలకులు దాన్ని నిర్వీర్యానికి పూనుకున్నారని, పైగా అవినీతీ ఎక్కువైందని విమర్శించారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారి పేర్లతో మస్టర్లలో హాజరు వేసి ఆ డబ్బులు నాయకులు, అధికారులు పంచుకుంటున్నారని మండిపడ్డారు. ప్రజలను భ్రమలకు గురిచేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు అన్నే పథకాలు రాకుండా చేస్తున్నారని, భూమి కొనుగోలు పథకాన్ని ఎత్తివేసారని, ఎస్సీ కార్పొరేషన్ రుణాలను నిలిపేశారని, ఈ నిధులను దారి మళ్లించారని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేటీకరిస్తోందని, ప్రభుత్వ ఆస్తులన్నీ పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని, మరోవైపు రాష్ట్రంలో పేదల చేతుల్లోని భూములను ప్రభుత్వం లాగేసుకుంటోందని అన్నారు. యడవల్లిలో దళితుల భూమిని మైనింగ్ సాకుతో లాక్కున్నారని, కనీసం సరైన నష్టపరిహారమూ ఇవ్వలేదని ఉదహరించారు. పైగా దీనికి వ్యతిరేకంగా పోరాడుతున్న వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని, అయినా యడవల్లి దళితులకు అండగా తమ సంఘం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ పంటలకు మద్దతు ధరలు దక్కక జిల్లాలో సాగు భూములు తగ్గాయని, ఈ ఖరీఫ్‌లో 2 లక్షల ఎకరాలు సాగుకు నోచక పడావుగా పడి ఉన్నాయని తెలిపారు. దీంతో కూలీలకూ పనుల్లేవన్నారు. ఈ నేపథ్యంలో మద్దతు ధరలతోపాటు ఉపాధి హామీ పనుల కోసం సంఘం ఉద్యమిస్తుందన్నారు. పల్నాడు జిల్లా కొత్తగా ఏర్పడిన నేపథ్యంలో వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వైపు పెద్ద ఎత్తున మళ్లిస్తున్నారని, ఈ క్రమంలో నిబంధనలు పాటించడం లేదని చెప్పారు. ప్రతి పేదల కాలనీలో కనీసం 10 శాతం కుటుంబాల్లోని వారు మద్యానికి బానిసలయ్యారని, ప్రభుత్వం ప్రకటించిన మద్య నియంత్రణ ఏమైందని ప్రశ్నించారు. మద్యానికి వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతుందన్నారు. ఇంటింటికీ వైద్యం ఆచరణలో అమలు కావడం లేదని, ప్రైవేటు ఆస్పత్రులనే సామాన్యులు ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. ఈ సమస్యలన్నింటిపైనా జిల్లాలోని ఆరు లక్షల మంది వ్యవసాయ కార్మికులను సంఘటితం చేసి పోరాడతామని చెప్పారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి, అధ్యక్షులు కె.రోశయ్య, నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, జె.భగత్, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పన్నులు, జూదం, క్యాసినోలకు మంత్రిత్వ శాఖ

ప్రభుత్వంపై జీవీ ఆంజనేయులు విమర్శలు



విలేకర్లతో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

సంక్రాంతి సందర్భంగా విశాఖ నుండి విజయనగరం వరకు వందల ఎకరాల్లో పెద్దపెద్ద గుడారాలు ఏర్పాటుచేసి జూదాలు, క్యాసినోలు ప్రోత్సహించి రూ.కోట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దండుకుంటున్నారని టిడిపి పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చెత్త పన్ను, ఇంటి పన్ను, జూదం, క్యాసినోలపై ఒక మంత్రిని పెట్టేలా ప్రభుత్వ తీరు ఉందన్నారు. కల్తీ మద్యం ద్వారా ప్రజారోగ్యంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెలగాటమాడుతోందని, పిచ్చి బ్రాండ్ల మద్యం తాగి ప్రాణాలా మీదకు తెచ్చుకోవద్దని ప్రజలను కోరారు. పంటలకు మద్దతు ధరల్లేక రైతులు అప్పుల్లో కూరుకుపోయారని, వీరిని ఆదుకోకుండా ప్రభుత్వం మోసం చేస్తోందని, ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులివ్వడం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సొంతూరైన శావల్యాపురం మండలం వేల్పూరులో సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలను పోలీసులు మైకు అనుమతులు లేవనే సాకుతో అడ్డుకోవడం దుర్మార్గమని జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. టిడిపి ఆధ్వర్యంలో ఉత్సవాలను సంతోషంగా నిర్వహిస్తుంటే జీర్ణించుకోలేని వైసిపి ఉద్దేశపూర్వకంగా పోలీసులు అడ్డుపెట్టుకొని ఆపివేయించిందని ఆరోపించారు. వైసిపి కార్యక్రమాలకు అడ్డురాని నిబంధనలు టిడిపి కార్యక్రమాలకు వచ్చాయా? అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు నాగేశ్వరరావు, జె.గోవిందు నాయక్, పి.దాసయ్య, ఆర్.వీరంజనేయరెడ్డి, ఎ.కాసింపాల్గొన్నారు.



చర్చి వార్షికోత్సవంలో వైవి ఆంజనేయులు

ప్రజాశక్తి - ముప్పాళ్ల

మండలంలోని తురకపాలెం సెయింట్ ఆంథోని దేవాలయం వార్షికోత్సవం మంగళవారం నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు పాల్గొని గ్రామస్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు సర్పంచ్ ఎం.చంద్రశేఖర్ ప్రతాప్, టిడిపి శ్రేణులు స్వాగతం పలికాయి. అనంతరం చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వైవి పాల్గొన్నారు. ఫాదర్ వై.థామస్ ఆశీస్సులు అందజేశారు. అనంతరం సర్పంచ్ నివాసంలో ప్రేమ విందు ఏర్పాటు చేయగా వైవి ఆంజనేయులు హాజరయ్యారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సిహెచ్.శ్రీనివాసరావు, ఎ.సాంబయ్య, బి.నాగేశ్వరరావు, ఎ.అమరేశ్వరావు, కె.రామకృష్ణ, పి.పెద్దిరాజు, ఆర్.దేవేంద్ర రావు, పి.నాగేశ్వరరావు, యల్లమంద పాల్గొన్నారు.

కోతులను పట్టిస్తున్నాం..



ప్రజాశక్తి - మాచర్ల : పట్టణ పరిధిలో కోతుల సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వాటిని కట్టడి చర్యలు ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, కమిషనర్ ఇవి రమణబాబు మంగళవారం తెలిపారు. కోతుల పట్టేవారిని పిలిపించి వారితో కోతులు ఎక్కువగా సంచరించే ప్రాంతాలలో నిఘా వేసి వాటిని పట్టుకున్నట్లు చెప్పారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోనులో వాటిని ఉంచి త్వరలో నల్లమల ఫారెస్టులో విడవనున్నట్లు తెలిపారు. త్వరలో వీధి కుక్కలను కూడా పట్టిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పోలూరి నరసింహరావు, కౌన్సిలర్లు పి.శ్రీనివాసరావు, ఆర్.వెంకటేశ్వర్లు, సిహెచ్. బాలస్వామిరెడ్డి, ఎ.జీవన్, చందు పాల్గొన్నారు.



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి

ఇకెవైసిని నాలుగు రోజుల్లో పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లాలోని 37 గ్రామాల్లో జగనన్న భూ హక్కు పత్రాలకు సంబంధించి 74 శాతం ఇకెవైసి పూర్తయిందని, మరో మూడు, నాలుగు రోజుల్లో నూరు శాతం పూర్తి చేయాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుండి మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్షించారు. 27 గ్రామాల్లో మ్యూటేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూ పంపిణీకి సంబంధించి అసైన్మెంట్ ల్యాండ్ల గుర్తింపును ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని, ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన శ్మశాన వాటికల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ పనుల్లో సమస్యలు రాకుండా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సమీక్షలో డిప్యూటీ కలెక్టర్ వసంత కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పటిష్టంగా ప్లాస్టిక్ నిషేధం అమలు

ప్రజాశక్తి - నరసరావుపేట

పట్టణ పరిధిలో ప్లాస్టిక్ నిషేధాన్ని పటిష్టంగా అమలు చేస్తామని మున్సిపల్ కమిషనర్ డి.రవీంద్ర మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. దుకాణాలపై ప్రతిరోజు తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు అమ్ముతున్న దుకాణాలపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై పురపాలక సంఘం అధికారులు నిత్యం తనిఖీలు చేస్తారని, 75, 125 మైక్రాన్‌ల కంటే తక్కువ పరిమాణం కలిగిన ప్లాస్టిక్ కవర్లు కలిగి ఉన్నా, వినియోగించినా, విక్రయించినా భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. తమకు పట్టణ ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.లక్షా 80 వేలు సరిపోవడం లేదు

జిల్లా కలెక్టర్‌కు జగనన్న లబ్ధిదారుల మొర

ప్రజాశక్తి - తుళ్లూరు : ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న రూ ఒక లక్షా 80వేలు సరిపోవడం లేదని జగనన్న ఇళ్ళ నిర్మాణ లబ్దిదారులు కలెక్టర్ ఎం వేణు గోపాల రెడ్డి వద్ద మొరపెట్టుకున్నారు. మంగళవారం మండలంలోని పెదపరిమిలో జగనన్న ఇళ్ళ నిర్మాణాల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా లబ్దిదారులు మాట్లాడుతూ అన్ని ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఇస్తున్న రూ. లక్షా 80వేలు ఏమాత్రం సరిపోవడం లేదని, ఇసుక అందుబాటులో లేదని కలెక్టర్ కు వివరించారు. దీనిపై కలెక్టర్ వేణుగోపాలరెడ్డి స్పందిస్తూ, ఇంటి ఫౌండేషన్ (పునాది)కి ఎక్కువ వ్యయం చేస్తున్నారని, తగ్గించుకోవాలని సూచించారు. ఇసుకను దగ్గరలో ఉన్న వైకుంఠ పురం ఇసుక రేవునుంచి లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్క లబ్దిదారుడు తనకు మంజూరు చేసిన స్థలంలో ఇంటిని నిర్మించుకోని లబ్ధిదారుల పేరును తొలగించి స్థలాన్ని అర్హులైన వారికి కేటాయిస్తా మన్నారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు మంచి నీటి కుళాయిల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆర్ డబ్ల్యు ఎస్ ఎ ఇ రేష్మను ఆదేశించారు. పెదపరిమిలోని జగనన్న కాలనీ లే ఔట్ చాలా బాగా ఉందని, ఇంటి నిర్మాణాలు అన్ని పూర్తయితే ఇక్కడే ఎలక్షన్ పోలింగ్ బూత్ కూడా వస్తుందని తెలిపారు. పేద లందరికీ ఇళు పథకంలో భాగంగా 8.91 ఎకరాలలో 342 ఇళ్ళ ప్లాట్లను లబ్ధిదారులకు పంపిణి చేయడం జరిగిందని, బేస్మెంట్ లెవెల్, ఆపైన పూర్తయిన ఇళ్లు129 ఉన్నాయని, 10 ఇళ్ళ నిర్మాణం పూర్తయిందని అధికారులు కలెక్టర్ కు వివరించారు. జనవరి 31 నాటికి నూరు శాతం ఇళ్లు నిర్మాణం బేస్మెంట్ లెవెల్ కు వచ్చేలా సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి



పెదపరిమిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

ఇళ్ళ నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కలెక్టరు ఆదేశించారు. అనంతరం సచి వాలయం, ఆర్‌బికే, ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. ఆరోగ్య కార్యకర్తలు కలెక్టర్‌కు బిపి చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య సేవలు అందిస్తున్న వైనాన్ని గురించి ఆరోగ్య కార్యకర్తలను, స్థానికులను అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో హౌసింగ్ పి డి సాయినాథ్, మండల ప్రత్యేక అధికారి దొరబాబు, ఎండివో శ్రీనివాసరావు, తహసీల్దార్ ప్రభాకర రావు, ఈవోపిఆర్డి సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులను బెదిరించడం సరికాదు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - దుగ్గిరాల

పేదలకు ఇళ్లు నిర్మించి ఇస్తామని ఇప్పుడు బెదిరించడం సరైన చర్య కాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. ప్రజల వద్దకు పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని రేవేంద్ర పాడులో సిపిఐ బృందం పర్యటించినది. జగనన్న లబ్ధిదారులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు ఇల్లు నిర్మించి ఇస్తామన్న ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం చేపట్టకపోతే ప్లాట్లు రద్దు చేస్తామని బెదిరించడం సరైన చర్య కాదన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ. 1,80,000 ఇళ్ల నిర్మాణానికి సరిపోవని ఇనుము, ఇసుక ఉచితంగా సరఫరా చేసి పేదల చేతికి రూ. 5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పునాదికి 33, 000 కేటాయించినది కానీ పునాదికే దాదాపు 85,000 ఖర్చు అవుతున్నాయని లబ్ధిదారులు తెలిపారన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని కోరారు. జనవరి 17వ తేదీ నుండి 31వ తేదీ వరకు జగనన్న టిట్కో హౌసింగ్ లబ్ధిదారుల నుండి సంతకాలు సేకరిస్తామని 31వ తేదీన తాసిల్దార్ కార్యాలయాల వద్ద అర్జీలు ఇస్తామని ఫిబ్రవరి 6 తేదీన జిల్లా కలెక్టర్ల కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమం చేపడతామన్నారు. ఫిబ్రవరి 22వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్న కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మంగళగిరి కార్యదర్శి జాలాది జాన్ బాబు, నాయకులుకాబోతూ ఈశ్వరరావు ముసునూరు సుహాస్ తదితరులు పాల్గొన్నారు.



రేవేంద్రపాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కె రామకృష్ణ తదితరులు

పొన్నూరు : విజయవాడలో మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఏడుకొండలు, జంపని గోవిందరాజులు, మీలిగల సత్యనారాయణ, పి సిద్దు, బి సుబ్బారావు పాల్గొన్నారు.

సిపిఎం బృందాలకు సమస్యల వెల్లువ



సిపిఎం బృందానికి సమస్యలు తెలుపుతున్న ప్రజలు

రోడ్డు వెడల్పు పేరుతో రోడ్డున పడేశారు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్‌నగర్, డోలాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో (7, 8 వార్డులు) మంగళగిరి విజయవాడ పాత జాతీయ రహదారి, మెయిన్ రోడ్డు వెడల్పు పేరుతో 18 నెలల క్రితం తమను రోడ్డున పడేశారని, ఇంతవరకూ రోడ్డు వేయలేదని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిరువ్యాపారులు చేసుకుని బతుకుతున్న తమను మున్సిపల్ అధికారులు ఆఘమేఘాల మీద వచ్చి తమ షాపులు, బడ్డీకొట్లు తొలగించి తమ నోటి కాడ కూడు తీశారని వాపోయారు. మంగళవారం సిపిఎం బృందం ఈప్రాంతంలో నిర్వహించిన సర్వేలో బాధితులు పలు విషయాలు తెలిపారు వానకు తడుస్తూ, ఎండకు ఎండుతూ ప్రస్తుతం చలిని తట్టుకుంటూ చిన్నపాటి తాత్కాలిక డేరాలు వేసుకుని దాని కిందే చిరువ్యాపారులు సాగిస్తున్నట్లు తెలిపారు. కరోనాతో వ్యాపారాలు తగ్గిపోయి కుటుంబాలు గడవటమే కష్టమైన పరిస్థితుతల్లో రోడ్డు వెడల్పు పేరుతో పాలకులు తమ పొట్ట కొట్టారని విమర్శించారు. అధికారులు ఇప్పటికైనా రోడ్డు మార్జిన్ పెంచి ప్రత్యామ్నాయం చూపాలని స్థానికులు కోరుతన్నారు. ప్రకాష్‌నగర్ వడ్డెరపాలెం పాత పంచాయతీ కార్యాలయం 10వ వార్డులో అనేక మంది పేదలు ఇళ్లు, ఇళ్లస్థలాలు లేక అద్దెలు కట్టలేకపోతున్నామని చెప్పారు. స్థానిక ఇస్లాంపేటలో మురుగు పోయే మార్గం లేక ప్రజలు దుర్వాసనతో పాటు దోమలతో ఇబ్బందులు పడుతున్నట్లు సర్వే బృందానికి చెప్పారు. ఇస్లాంపేట, ప్రకాష్‌నగర్ వాటర్ ట్యాంకు ప్రాంతాల్లో నివశిస్తున్న పేదల ఇళ్లకు పట్టాలు లేవని తెలిపారు. ఇస్లాంపేటలో కోతుల బెడద ఎక్కువైందని, ఇళ్లలోకి వచ్చి వస్తువులను ఆగం చేస్తున్నాయని, మున్సిపల్ అధికారుల తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సర్వేలో సిపిఎం నాయకులు వేముల దుర్గారావు, ఆర్.వెంకటరత్నం, సాంబయ్య, ఎండి రఫీ, బి.ప్రభాకర్, డి.దుర్గారావు, వెంకన్న పాల్గొన్నారు.

సమస్యల నిలయాలు 4, 5 వార్డులు

ప్రజాశక్తి - మంగళగిరి

పట్నంలోని 4, 5 వార్డుల్లో సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సర్వే జరిగింది. సర్వే బందానికి ఆ ప్రాంత ప్రజలు పడుతున్న అనేక సమస్యలను తెలిపారు. నాలుగో వార్డులో గిరి ప్రదక్షణ పేరుతో ఇళ్ల స్థలాలు తొలగించాలని చూశారని, కోర్టుకి వెళ్లడంతో నిలిచిపోయిందన్నారు. అక్కడ ఇళ్లు వేసుకుని నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, ఇల్లు నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలని వారు కోరారు. అదేవిధంగా నాలుగు ఐదు వార్డుల్లో పెన్షన్లు, రేషన్ కార్డులు రద్దు అయినాయని తెలిపారు. అర్హులైన పేదలకు టిడ్కో ఇళ్లు మంజూరు కాలేదని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం నాలుగో వార్డ్ కార్యదర్శి జె. బ్రాహ్మణి, నాయకులు ఆర్ వేణు, ఈగ సాంబయ్య, జై నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలో వార్డు ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం బృందం నాయకులు



దుగ్గిరాల మండలంలో జగనన్న కాలనీ పరిశీలిస్తున్న సిపిఎం బృందం

జగనన్న కాలనీల్లో కనీస వసతుల్లేవు

ప్రజాశక్తి - దుగ్గిరాల

దుగ్గిరాల మండలం పెద్ద కొండూరు, గొడవర్రు, శంగార పురం గ్రామాలలో సిపిఎం ఆధ్వర్యంలో జగనన్న కాలనీలను సర్వే చేశారు. పెద్ద కొండూరు గ్రామంలో 260 మందికి ఇళ్లస్థలాలు పంపిణీ చేస్తే కేవలం ఐదుగురు మాత్రమే ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కొంతమంది పునాదులు వేసి ప్రభుత్వం ఇచ్చే డబ్బులు చాలక బేస్ మట్టం లెవెల్ ల్లోనే ఆపేశారు. వీటిల్లో పిచ్చి మొక్కలు, ముళ్ళకంప పెరిగాయి. సిపిఎం బందం ప్రజల్ని కలిసినప్పుడు ప్రభుత్వం ఇచ్చే లక్షా 80వేలు చాలడం లేదని ఇంటి నిర్మాణం చేపట్టాలంటే అప్పు చేయాల్సి వస్తుందని అందువల్ల నిర్మాణం చేపట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ జగనన్న కాలనీలకు రూ.5 లక్షలు కేటాయించాలని, అలాగే ఇనుము, సిమెంటు, ఇసుక, ఇటుక అందుబాటు ధరలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, నాయకులు వల్లభనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఈమని అప్పారావు తదితరులు



మంగళగిరిలో నివాళి

జ్యోతిబసుకు ఘన నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి : సిపిఎం అగ్ర నేత జ్యోతి బసు వర్ధంతి సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సిపిఎం కార్యాలయంలో జ్యోతిబాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బెంగాల్ ముఖ్యమంత్రిగా 24 సంవత్సరాల పరిపాలన చేసి ప్రజల కోసం పనిచేసిన ముఖ్యమంత్రిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చెంగయ్య, సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు, పి బాలకృష్ణ, నాయకులు ఎం చలపతిరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు జీవి ప్రసాద్, ఎన్ కిషోర్, జే నవీన్ ప్రకాష్, ఎస్ గణేష్, గోలి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- ఫిరంగిపురం : స్వాతంత్ర సమరయోధుడు, భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఒకరు, పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా 24 సంవత్సరాలు సేవలందించి చరిత్ర సృష్టించిన జ్యోతిబాస్ 13వ వర్ధంతి పొనగుపాడులో నిర్వహించారు. జ్యోతిబసు చిత్రపటానికి రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ గుంటుపల్లి బాలకృష్ణ, సిపిఎం ఫిరంగిపురం మండల కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైతుల సమక్షంలో భూ సర్వే నిర్వహించాలి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన భూ రీ సర్వేను రైతుల సమక్షంలోనే నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. మంగళవారం ఎంటిఎంసి పరిధి లోని ఇప్పటం గ్రామంలో రైతు నాయకులతో కలిసి ఆయన భూ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వే రైతులకు అవగాహన కల్పించే విధంగా కార్యక్రమం చేపట్టాలన్నారు. అదేవిధంగా రైతులు ఆందోళన చెందకుండా, ప్రతి గ్రామంలోనూ గ్రామసభలు నిర్వహించి, సర్వే ను చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసులు రెడ్డి, రైతు సంఘం నాయకులు కాట్రగడ్డ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న హెచ్‌ఎంలు

స్కూల్ అసిస్టెంట్ ఖాళీల భర్తీకి అర్హులకు సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు

ఉన్నత పాఠశాలల్లో అవసరమైన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సీనియర్ సెకండరీ ఉపాధ్యాయులకు స్థానిక పాతబస్టాండ్ వద్ద గల మంగళవారం గణితం, బయోలాజికల్ సైన్స్, ఇంగ్లీషు, సోషల్ సబ్జెక్టులకు సంబంధించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ఎ.తిరుమలేష్, జె.రమేష్‌కుమార్, జి.శ్రీనివాసరావు, జె.సురేష్‌కుమార్, కె.విజయభాస్కర్, ఎ.రాఘవేంద్రరావు, కెవి రామిరెడ్డి, యం.డానియల్, ఉర్దూ డిఐ ఖాసిం తదితరులు ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించారు.సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తిఅయిన ఆయా ఉపాధ్యాయులు 18న మధ్యాహ్నం 2 గంటలకు డిఇఒ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డిఇఒ పి.శైలజ తెలిపారు.

22-29 తేదీల్లో జాతీయ స్థాయి ఒంగోలుజాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నరసరావుపేట

స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని జిల్లా క్రీడా ప్రాంగణంలో ఈనెల 22-29 తేదీల్లో గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మెమోరియల్ జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లను వైసిపి నాయకులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడేళ్లుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, రైతులతో పాటు ప్రజలందరి నుండి మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. అంతరించిపోతున్న ఒంగోలు జాతి పశు సంపదను అభివృద్ధి చేసుకోవాల్సిన ఆవశ్యతను తెలియజేస్తూ ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పాలపళ్ల విభాగం మొదలుకొని 2 పళ్లు, 4 పళ్లు, 6 పళ్లు, 8 పళ్లు, సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్ విభాగాల్లో ఎనిమిది రోజులపాటు నిర్వహించే పోటీల సందర్శనకు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు టిడిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - నరసరావుపేట : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈ నెల 27 నుంచి చేపట్టనున్న 'యువగళం' పాదయాత్రకు మద్దతుగా 'నాడు తాత-నేడు మనవడు' కార్యకమం పేరుతో భారీ బైక్ ర్యాలీని బుధవారం నిర్వహిస్తామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులతో కలిసి మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. జనవరి 18 ఎన్టీఆర్ వర్థంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, టిడిపి కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై మల్లమ్మ సెంటర్, పల్నాడు బస్టాండ్, కావేరి ట్రావెల్స్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పెద్ద చెరువు బైపాస్ రోడ్ మీదుగా ఇస్సాపాలెం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ముగుస్తుందని వివరించారు. టిడిపి శ్రేణులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు వి.సింహాద్రి యాదవ్, కె.కిరణ్, కె.కోటిరెడ్డి, కె.కోటిసుబ్బారావు, ఎం.షరీఫ్, మీరవాలి పాల్గొన్నారు.

నేడు మహారక్తదాన శిబిరం

ప్రజాశక్తి - చిలకలూరిపేట : ఎన్టిఆర్ 27వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక పండరిపురంలోని టిడిపి కార్యాలయంలో మహారక్తదాన శిబిరం నిర్వహిస్తామని మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు మంగళవారం తెలిపారు. తెలుగు యువత, ఐ-టిడిపి, టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరంలో అందరూ వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

మహాశివరాత్రికి 57 ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - రెంటచింతల : వచ్చేనెల 18న మహాశివరాత్రి సందర్భంగా మాచర్ల డిపో నుంచి వివిధ పుణ్యక్షేత్రాలకు 57 ప్రత్యేక బస్సులను నడుపుతామని మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.పిచ్చయ్య మంగళవారం తెలిపారు. సత్రశాలకు మంగళవారం వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సత్రశాలకు 36, శ్రీశైలం 15, దైద 2, తేరాల 2, మన్నేపల్లి 2 బస్సులు నడుపుతామన్నారు. కార్గో ఆదాయం గతంలో రోజుకు రూ.2 వేలు ఉండగా ఇప్పుడు రూ.7 వేల నుండి రూ.10 వేల వరకూ పెరిగిందని చెప్పారు.

మాచర్ల మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా నారాయణ

ప్రజాశక్తి - రెంటచింతల : మాచర్ల మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా రెంటచింతల మండలం మంచికల్లుకు చెందిన ధాన్యం వ్యాపారి ఆత్మకూరి నారాయణ నియమితులయ్యారు. నారాయణ ఈనెల 23న ఛైర్మన్ వెంకటేశ్వరరెడ్డితో కలిసి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డికి నారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

జ్యోతిబసుకు ఘన నివాళులు

ప్రజాశక్తి - ముప్పాళ్ల



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు 13 వర్ధంతి సభ మండలంలోని మాదల గ్రామంలోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి సిపిఎం ఎం.వెంకటరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి జి.బాలకృష్ణ మాట్లాడుతూ జ్యోతిబసు ఏన్నో ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా కొనసాగి ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రధానమంత్రి పదవి పొందడానికి అవకాశం వచ్చినా పార్టీ నిర్ణయానుసారం దాన్ని తిరస్కరించిన నిబద్ధుడని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ఐక్యంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జి.జాలయ్య, పి.సైదాఖాన్, కె.సాంబశివ రావు, సిహెచ్.నాగమల్లేశ్వరరావు, ఐ.సత్యనారాయణరెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, జి.రామారావు, టి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - నరసరావుపేట



సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న జెసి

సచివాలయ సిబ్బంది సమయపాలనతో పాటు అంకిత భావంతో పనిచేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అన్నారు. రావిపాడు -1, నరసరావుపేట పట్టణంలోని చాకిరాల మిట్ట 32, 33, 34 సచివాలయాలను జెసి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సేవలను పకడ్బందీగా అందించాలని, ప్రతిరోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధంగా ప్రజలలో అవగాహన కల్పించి పరిశుభ్రతను పెంపొందించేలా చర్యలు చేపట్టాలన్నారు. చాకిరాల మిట్ట సచివాలయ పరిధిలో ఒకరికి డెంగ్యూ జ్వరం రావడం గుర్తించి ఆ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరాలు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలను నివారించాలని, ఇంటి ప్లాన్ అనుమతి విధిగా ఉండేలా చూడాలని చెప్పారు. పరిశీలనలో తహశీల్దార్ రమణ నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదుతో రైతుకు మేలు



ఈపూరు మండలంలో ఈ-క్రాప్ నమోదు

ప్రజాశక్తి - ఈపూరు

ఈ-క్రాఫ్‌లో పంట వివరాలు నమోదు చేయడం ద్వారా రైతులకు ప్రభుత్వం ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరుతాయని మండల వ్యవసాయాధికారి ఆర్.రామారావు అన్నారు. మండలంలోని ఎర్రబాలెంలో మొక్కజొన్న పొలాలను ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. రబీ సీజన్‌కు సంబంధించి ఆయా గ్రామాల్లో సాగుచేసిన పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని రైతులకు సూచించారు. పంట యాజమాన్యంలో ఏవైనా సమస్యలుంటే సమీకృత రైతు సమాచార కేంద్రం (155251) ద్వారా సమస్యలను నివృత్తి చేసుకోవాలని చెప్పారు. ఆయనవెంట గ్రామ వ్యవసాయ సహాయకులు శేషబాబు ఉన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల

రైతులంతా తమ పంటను విధిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ సూచించారు. మండలంలోని చందవరంలో పైర్లను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శెనగ పంటకు కనీసం మద్దతు ధర రూ.5230గా ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. మార్కెట్లో సరైన ధర లేకుంటే ప్రభుత్వమే పంటను మద్దతు ధరకు కొంటుందని, అయితే ఈ-క్రాప్‌లో నమోదైతేనే ఆ అవకాశం ఉంటుందని చెప్పారు. మండలంలో 1670 ఎకరాల్లో శెనగ సాగువుతోందని, ప్రస్తుతం పూత, పిందె దశలో ఉందని చెప్పారు. ప్రస్తుతానికి చీడపీడలేమీ లేకున్నా మంచి కాపు రావడానికి ఐదు రోజుల వ్యవధిలో ఒక కిలో ముల్లి కె 13 0 45లో ఫార్ములు 4 400 గ్రాములు చొప్పున పిచికారి చేస్తే మంచి దిగుబడి వస్తుందని వివరించారు.



సమస్యలు చెబుతున్న నాయకులు

రైతులపైనే ధాన్యం రవాణా భారంధాన్యం కొనుగోలులో ఇబ్బందులు

ప్రజాశక్తి - వినుకొండ

ధాన్యం కొనుగోలులో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో మంగళశారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలకు రైతులు తీసుకెళుతున్న ధాన్యాన్ని మిల్లులకు రైతులే తీసుకెళ్లాలంటున్నారని, పైగా వినుకొండ నియోజకవర్గ పరిధిలో ఉన్న మిల్లులు కాకుండా నరసరావుపేట, పిడుగురాళ్ల తదితర దూర ప్రాంతాలకు తీసుకెళ్లాలని చెబుతున్నారని అన్నారు. దీంతో రైతులు ధాన్యాన్ని అమ్మలేకపోతున్నారని చెప్పారు. సమావేశంలో రైతులు ఎం.అంకుల్, పి.వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.


బల్లకట్టు నిలిపివేతకు డీఎస్పీ ఆదేశం

ప్రజాశక్తి - మాచవరం



బల్లకట్టును పరిశీలిస్తున్న పోలీసులు

మండలంలోని గోవిందాపురం సమీపంలోని కృష్ణా నదిపై అనుమతి లేకుండా తిప్పుతున్న బల్లకట్టును నిలిపివేయాలని గురజాల డీఎస్పీ ప్రసాదరావు ఆదేశాలు జారీ చేశారు. సంక్రాంతి నేపథ్యంలో సాధారణ తనిఖీల్లో భాగంగా గోవిందాపురం పరిసరాలను డీఎస్పీ మంగళవారం పరిశీలించారు. ఇక్కడ కృష్ణా నదిపై తెలంగాణ వైపుకు అనుమతి లేకుండా తిప్పుతున్న బల్లకట్టును గమనించి దాన్ని నిలిపేయాలని నిర్వాహకులను ఆదేశించారు. మండలంలో ఎక్కడైనా జూదం, పేకాట, కోడిపందాలు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. వీటిని నిర్వహిస్తున్నట్లు ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఆయనవెంట ఎస్ఐ ఎస్.కోటయ్య, సిబ్బంది ఉన్నారు.



చెక్కును అందిస్తున్న డెయిరీ మేనేజర్ తదితరులు

పాడి రైతుకు బీమా చెక్కు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక విష్ణుకుండి నగర్‌కు చెందిన చిరుమామిళ్ల కోటేశ్వరరావు పాలకేంద్రం వద్ద పేరం వెంకటేశ్వర్లు గేదెలు మృతి చెందడంతో హెరిటేజ్ డెయిరీ యాజమాన్యం బీమాను మంజూరు చేసింది. ఈ చెక్కును డెయిరీ మేనేజర్ చింత శ్రీనివాసరావు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా స్థానిక పాలకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాడి రైతుకు రూ.20 వేల ఆర్థిక సహాయంతో పాటు బీమా చెక్కును ఇచ్చారు. హెరిటేజ్ డెయిరీ పరిధిలో పశువులకే ఇన్సూరెన్స్ కాకుండా డెయిరీ సభ్యులకు కూడా ప్రమాద బీమా ఉన్నారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారులు వై.శ్రీనివాసరావు, ఎన్.కృష్ణ, వి.శ్రీను, ఎన్.అంజయ్య, జి.కొండయ్య పాల్గొన్నారు.

నిరుద్యోగులను విస్మరించిన ప్రభుత్వం



ప్రజాశక్తి - పెదకూరపాడు : నిరుద్యోగులను వైసిపి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని టిడిపి మహిళా నాయకులు విమర్శించారు. మండలంలోని రామాపురంలో మంగళవారం నిర్వహించిన మాటామంతి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రతిఏటా జాబ్ కేలండర్ విడుదల చేస్తామని ఇచ్చిన హామీ నీటి మీద రాతగా మారిందని, ఇటువంటి ప్రభుత్వాన్ని సాగనంపాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్.కృష్ణకుమారి, షేక్ ముంతాజ్, ఎన్.ఈశ్వరి, కె.శివమ్మ, ఎం.సీత, భూలక్ష్మి, కె.వెంకాయమ్మ, జి.సునీత పాల్గొన్నారు.





పొనుగుపాడు గ్రామంలో క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న షేక్ మస్తాన్ వలి



పెదనందిపాడులో బహుమతులు అదజేస్తున్న ఖాసింబీ,ఎస్ఎస్‌యూత్ సభ్యులు

క్రీడాకారులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి- ఫిరంగిపురం

మండలంలోని పొనుగుపాడు గ్రామంలో తెలుగు యువత సహకారంతో డివైఎఫ్ఐ 38వ వార్షికోత్సవ సంక్రాంతి సంబరాలు విజయవంతంగా జరిగాయి. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మాజీ నాయకులు, సిఐటియు ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులు షేక్ మస్తాన్‌లి ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి గ్రైండర్, మిక్సీ, రైస్ కుక్కర్ వంటి విలువైన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన ఉడతా వాసు, వేమూరి కిరణ్, ఏమని బ్రహ్మం షేక్ జవహర్, కే మోహన్, వేమూరి జ్యోతి తదితరులకు అభినందనలు తెలిపారు. అలాగే గ్రామంలో జరిగిన అభినయ నాటక కళా పరిషత్ నాటికలను, గ్రామ మహిళలకు , బాల బాలికలకు, ,పెద్దలకు అందరికీ డివైఎఫ్ఐ ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ తరఫున షేక్ మస్తాన్‌వలి అభినందనలు తెలియజేశారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

మానసిక ఉల్లాసానికి క్రీడా పోటీలు దోహదపడతాయని ఉప ఎంపిపి ఖాసింబి, సర్పంచ్ పద్మారావు అన్నారు. స్థానిక శివాలయం వీధిలో ఎస్ఎస్ యూత్ వారు గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న సంక్రాంతి క్రీడా పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా చిన్నారులకు పెద్దలకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి దాత ఎస్‌కె కన్‌స్ట్రక్షన్స్ ఎండి పత్తిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ షేక్ ఖాసిం పీరా రూ. 60 వేలతో బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీలో ప్రథమ బహుమతి సాధించిన కొమ్మినేని సుజాతకు గ్రైండర్‌ను అందజేశారు. రాష్ట్రస్థాయి మహిళ కర్ర సాము పోటీలో పాల్గొని గెలుపొందిన మహిళలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దివి రాంబాబు. మండల్ కోఆప్షన్ నెంబరు మస్తాన్ వలి. ఎస్ ఎస్ యూత్ అధ్యక్ష కార్యదర్శులు లోకేష్, శాంతి బాబు. గౌస్ పీర్. గోవిందు , మహేష్, ప్రఖ్యాత వ్యాఖ్యాత వివి బ్రహ్మం, సురేష్, కిరణ్, రమణ, కిషోర్, పవన్ సాయి , రవి, రమేష్ పాల్గొన్నారు.



షూటిబాల్ పోటీల ఎంపికలకు వచ్చిన క్రీడాకారులు

షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్

శాప్ లీగ్ గుంటూరు జిల్లా షూటింగ్ బాల్ పోటీల ఎంపికలు మంగళవారం ఎంటిఎంసి పరిధిలోని కొలనుకొండలో ఎక్సలెన్సీ అకాడమీ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ షూటింగ్ బాల్ పోటీల ఎంపికకు బాలబాలికలు చాలా ఉత్సాహంగా పాల్గొన్నారు. అదేవిధంగా యు -17, యు-21 బాల బాలికలు ఈ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21వ తేదీన విజయవాడలో జరుగు అండర్-17 రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు, అదేవిధంగా ఈనెల 29వ తేదీన బాపట్లలో జరిగే అండర్-21 బాల బాలికలు ఎంపిక అయినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సురేంద్ర, అకాడమీ కోచ్ ఎంఎ అలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ రామచంద్రరావు, పీఈటీలు పాల్గొన్నారు..

సహాయం చేయడంలోనే ఆనందం

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్



నగదు సహాయం అంద చేస్తున్న దాసరి శేషగిరిరావు

ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం అందించడం లో ఆనందం ఉంటుందని దాత దాసరి శేషగిరిరావు అన్నారు. మంగళ వారం ప్రమాదవశాత్తు జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదంలో కాలు చేయి స్పర్శ కోల్పోయి పనిచేసుకోలేని స్థితిలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న షేక్ నబీ సాహెబ్‌కు పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు రూ. 10 వేలు నగదు అందజేశారు. నబి కూతురు స్థానిక పిఎన్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నందున చక్కగా చదువుకొని మంచి మార్కులు సాధిస్తే తన చదువుకు కూడా సహాయం అందజేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నబి కుటుంబ సభ్యులు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యర్థాలకు నిలయంగా బకింగ్‌హోమ్ కెనాల్

ప్రజాశక్తి-తాడేపల్లి







ఉండవల్లి సెంటర్‌లో బకింగ్‌హోమ్ కెనాల్ వ్యర్థాలకు నిలయంగా మారింది. మరుగుదొడ్ల నిర్వహిస్తున్న నిర్వాహకులు వ్యర్థాలన్నీ పక్కనే ఉన్న బకింగ్ హోమ్ కాలువలో కలుపుతున్నారు. ఎక్కడి నుంచో తీసుకొచ్చిన సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను కూడా బకింగ్ హోమ్ కాలువలోకి వదలడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా నివాసం ఉండే ప్రజలు అనేక సార్లు హెచ్చరించినా పరిస్థితిలో మార్పు రావడంలేదని వాపోతున్నారు. సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు వదిలే సమయంలో, మరుగుదొడ్ల ద్వారా వ్యర్థాలను బకింగ్ హోమ్ కాలువలో కలిపే సమయంలో వస్తున్న దుర్వాసన వల్ల తమ ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. మా కుటుంబాల ఆరోగ్యాలు దెబ్బతింటాయని ఆందోళన చెందుతున్నారు. సబంధింత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

'సైకో పోవాలి.. సైకిల్ రావాలి'

ప్రజాశక్తి - తాడికొండ :నియోజకవర్గ కేంద్రమైన తాడికొండ గ్రామంలో మంగళవారం సైకో పోవాలి.. సైకిల్ రావాలని టిడిపి నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ప్రదర్శన జరిపారు. జనవరి 27న లోకేష్ పాదయాత్ర విజయవంతం చేయాలని కోరారు.రాష్ట్ర టిడిపి సాధికార సమితి కన్వీనర్ ధూళిపాళ్ల యేసుబాబు మాట్లాడుతూ లోకేష్‌బాబు పాదయాత్రకు గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలియజేస్తామని చెప్పారు. ప్రతి గ్రామంలో బుధవారం నందమూరి తారక రామారావు వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని కోరారు. రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ బి. కోటేశ్వరరావు, కె బుల్లయ్య,అనిషా అమీర్, ఎం గోపి, కె. పున్నయ్య, చిన్న, ఎన్.పెద్దబ్బాయి, టి.అప్పారావు, కె. అంజయ్య, సాంబశివరావులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న రికవరీ ఏజెన్సీలు

వాయిదా చెల్లింపు ఆలస్యమైతే వేధింపులు

ప్రజాశక్తి-తాడేపల్లి:లోన్ తీసుకుని తగిన సమయంలో కిస్తీ చెల్లించకపోతే రికవరీ ఏజెంట్లు రెచ్చిపోతున్నారు. విజయవాడ కేంద్రంగా తాడేపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు వంద కంపెనీలు లోన్లు ఇస్తున్నాయి. లోన్లు చెల్లించడంలో ఆలస్యం అయితే సంబంధించిన కంపెనీ రికవరీ ఏజెంట్లకు ఆ బకాయిలు అప్పజెబుతుంది. రికవరీ ఏజెంట్లు రంగంలోకి దిగిన తరువాత లోన్ తీసుకున్న వ్యక్తితో పాటు ఆ ఇంట్లో ఉన్న వారందరికీ ఫోన్లు చేసి అసభ్యపదజాలంతో దూషిస్తున్నారు. అక్కడితో ఆగకుండా వారి బంధువులకు కూడా ఫోన్లు చేసి లోన్ తీసుకున్న వ్యక్తి గురించి చెప్పి లోన్లు చెల్లించడంలేదని చులకన చేస్తున్నారు. ఇటీవల ఉండవల్లికి చెందిన ఓ యువకుడు భారత్ పేకు చెందిన ఓ కంపెనీలో ఫోన్ పేద్వారా రూ.50 వేలు లోన్ తీసుకున్నారు. దీంతో రికవరీ ఏజెంట్లు తమ ప్రతాపం చూపిస్తున్నట్లు వాపోయాడు. ఈ మధ్య తాడేపల్లి చుట్టుపక్కల ప్రాంతంలో ఇటువంటి సంఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. బాధితుడు ఫోన్ పే రికవరీ ఏజెంట్ మీద పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం వద్ద మంగళవారం భగీరథ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో యాచకులకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ చలికాలంలో యాచకులు చలికి ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి 25 మందికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు జుట్రూ ఏడుకొండలు, కర్నాటి శివ సత్యనారాయణ, కటారి విష్ణుమూర్తి, దుంపల స్వాములు, కగ్గా శ్రీను, నంద్యాల గోపాలకృష్ణమూర్తి, ఇట్లా జగపతి తదితరులు పాల్గొన్నారు.



యువతీ, యువకులను సన్మానిస్తున్న గంజి చిరంజీవి

యువతి, యువకులకు సన్మానం

ప్రజాశక్తి - మంగళగిరి

స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రామనాథం చిన్న కోటయ్య, శివ పార్వతి వృద్ధుల సేవా ఆశ్రమంలో వివిధ రంగాల్లో రాణించిన యువతీ,యువకులను సన్మానించారు. అనంతరం వృద్ధులకు నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వరావు, వైఎస్ఆర్సిపి చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గంజి చిరంజీవి, సన్మాన గ్రహీతలు ఆర్ కోటి జవహర్, ఆర్ సాయిశ్రీ, ఆర్ సుమన్, ఆర్ హేమంత్, డి.కావేరి పాల్గొన్నారు.



రాజశేఖర్‌ణు సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కారుమూరి రాజశేఖర్‌కు సన్మానం

ప్రజాశక్తి - చేబ్రోలు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మూడు మెడల్స్ సాధించిన చేబ్రోలు వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు కారుమూరి రాజశేఖర్‌ను సోమవారం అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. మండలంలోని చెరువులోపాలెంకు చెందిన కారుమూరి రాజశేఖర్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఐదు కిలోమీటర్ల నడకలో గోల్డ్ మెడల్,100 మీటర్లు హడ్డిల్స్‌లో గోల్డ్ మెడల్, లాంగ్ జంప్‌లో సిల్వర్ మెడల్ మూడు విభాగాల్లో మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా అషోషియేషన్ ప్రెసిడెంట్ చుక్కా శివరామకృష్ణ మాట్లాడుతూ చేబ్రోలు వాకర్స్ అసోసియేషన్ సభ్యునిగా ఉంటూ మెడల్స్‌ను సాధించి చేబ్రోల్ వాకర్స్ అసోసియేషన్‌కు గుర్తింపు తేవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని తెలిపారు. రాజశేఖర్ ను అసోసియేషన్ తరఫున సన్మానించుకోవడం ఎంతో సంతప్తిని కలిగిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి మాసంలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనేందుకు ఎంపికయ్యారని, హర్యానా రాష్ట్రంలో జరిగే పోటీలలో రాజశేఖర్ పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

67 పాఠశాలలకు సిబిఎస్ఇ సిలబస్ అనుబంధం

ప్రజాశక్తి - రెంటచింతల : ఈ విద్యా సంవత్సరంలో పల్నాడు జిల్లాలోని 28 మండలాల్లో 67 పాఠశాలకు సీబీఎస్ఈ సిలబస్ అనుబంధం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని మాచర్ల నియోజకవర్గం స్పెషలాఫీసర్, పల్నాడు జిల్లా డీఈవో మేకతోటి వెంకటప్పయ్య చెప్పారు. మంగళవారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎనిమిదో తరగతి విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తున్నామని వచ్చే సంవత్సరం 9 తరగతి, ఆ తర్వాత పదవ తరగతికి ఈ సిలబస్ ను వర్తింపు చేస్తారన్నారు. కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలను ఆ స్థాయికి తీసుకుపోవడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. జిల్లాలో 14 మోడల్ స్కూల్, 24 కేజీబీవీలు, 18 జిల్లా పరిషత్ పాఠశాలలు రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించి బీసీ ఎస్సీ ఎస్టీ పాఠశాలలో సిలబస్‌ను బోధిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. రెండవ దశ నాడు నేడు పనులు చివరి దశకు చేరాయన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ఏ ఎస్ ఓ పద్మాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంకు ఇన్నోవేటివ్ వర్సిటీగా గుర్తింపు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయానికి 'ఇన్నోవేటివ్ యూనివర్సిటీ ఆఫ్ ది ఇయర్ 2022'గా గుర్తింపు లభించింది. బెంగళూరు కేంద్రంగా ప్రచురితమ వుతున్న అకడమిక్ ఇన్సైట్స్ మేగజైన్ యాజమాన్యం దీన్ని ప్రకటించింది. ఉన్నత విద్యారంగంలో సాధించిన ప్రగతి, నూతన ఆవిష్కరణలకు గుర్తింపుగా ప్రయివేటు విశ్వవిద్యాలయాల కేటగిరీలో ఏపీ ఎస్ఆర్ఎంను ఎంపిక చేసినట్లు మేగజైన్ ప్రకటించింది. ఏటా విశ్వవిద్యాలయాల పనితీరును విశ్లేషించి ఉత్తమ యూనివర్సిటీలకు ఈ మేగజైన్ వివిధ కేటగిరీలలో ప్రత్యేక గుర్తింపును ఇస్తుందనీ, ఇందులో భాగంగా 2022 విద్యా సంవత్సరానికి గాను ఉత్తమ సజనాత్మక విశ్వవిద్యాలయంగా ఏపీ ఎస్ఆర్ఎం ఎంపికైనట్లు కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

11,12 తేదీల్లో గుంటూరులో బాలోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా బాలోత్సవం ఫిబ్రవరి 11, 12 తేదీల్లో గుంటూరు, లక్ష్మీపురంలోని పాటిబండ్ల శీతారామయ్య హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ, ఆహ్వాన సంఘం అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఆహ్వాన సంఘం కార్యవర్గ సభ్యులతో కలిసి మంగళవారం స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో బాలోత్సవం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మీడియాతో మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను ప్రోత్సహించటానికి, వారిలో నైపుణ్యాలను వెలికి తీయటానికి బాలోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యారంగం కార్పొరేటీకరణ జరిగిన తర్వాత విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించటానికి ఇటువంటి పోటీలు బాగా ఉపయోగడతాయని పేర్కొన్నారు. 2020లో నిర్వహించిన బాలోత్సవానికి మంచి స్పందన వచ్చిందని, కోవిడ్ వల్ల రెండేళ్ల విరామం వచ్చిందని, తిరిగి ఈ ఏడాది నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 4-7 తరగతులకు జూనియర్స్‌గా, 8, 9, 10 తరగతులకు సీనియర్స్‌గా రెండు విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. కావున పిల్లల పండుగగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని పురప్రముఖులు, విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించి, విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆహ్వాన కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎం.బోసుబాబు, ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ మొత్తం 23 అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. వక్తృత్వం, వ్యాసరచన, పద్యపఠనం, క్విజ్ తదితరాలు, సంగీతం విభాగంలో శాస్త్రీయ సంగీతం, దేశభక్తి గీతాలు, వాద్య సంగీతం ఉంటాయని తెలిపారు. రంగస్థల విభాగంలో ఫ్యాన్సీ డ్రస్, ఏకపాత్రాభినయం, స్కిట్, నృత్యంలో శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, వెస్టన్ డ్యాన్స్ అంశాల్లో పోటీలుంటాయన్నారు. లలిత కళలు విభాగంలో డ్రాయింగ్, రూపా చిత్రం, మట్టితో బొమ్మలు, కొల్లేజ్, షార్ట్ ఫిల్మ్, సాంప్రదాయ కళల విభాగంలో చెక్క భజన, కోలాటం ఉంటాయని వివరించారు. పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్, ముగింపులో ఓవరాల్ ఛాంపియన్ బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం కన్వీనర్లు కెవిఎస్ దుర్గా ప్రసాద్, జి.వెంకటరావు, చావా శ్రీనివాస్, బి.శంకర్‌సింగ్, యం.ఉదయభాస్కర్, జోజిబాబు, కె.శ్రీదేవి, ఆర్.స్వాతి, హనుమంతరాజు, పి.ప్రవీణ్, యం.డి.అక్బర్. ఇ.అనిల్ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు తదితరులు

పోలీస్ స్టేషన్ ముందు న్యాయపోరాటం

అత్తింటివారు వేధిస్తున్నారని ఫిర్యాదు - పోలీసులు న్యాయం చేయలేదని విమర్శ

ప్రజాశక్తి - మంగళగిరి

గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్ ముందు మంగళవారం సముద్రాల మమత అనే మహిళా ఆందోళన చేపట్టినది. న్యాయం చేయమని పోలీస్ స్టేషన్ ఆశ్రయిస్తే పోలీసులు కూడా అన్యాయం చేశారని మీడియాతో మాట్లాడుతూ అన్నారు. గతనేల డిసెంబర్ 15న తాడేపల్లి పోలీస్ స్టేషన్ ముందు తన భర్త అదనపుకట్నం కోసం వేధిస్తూ, తనని వదిలించుకోవటానికి హెచ్ఐవి పాజిటివ్ రక్తం ఎక్కించాడని అతని మీద చర్య తీసుకోవాలని తాడేపల్లి స్టేషన్ ముందు ఆందోళన చేసానని తెలిపారు. ఈ నేపథ్యంలో నాభర్త ముప్పూరు చరణ్ కుమార్ ను పోలీసు వారు అదుపులోకి తీసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేసి రిమాండ్ పంపించారు. ఇక్కడే పోలీసు వారు పక్షపాతంగా వ్యవరించారని నేను నలుగురు మీద ఫిర్యాదు చేస్తే నా భర్త ఒక్కరినే అరెస్టు చేసి ఈజీగా బెయిల్ వచ్చే సెక్షన్లు నమోదు చేసి పదిరోజుల్లో బయటకు వచ్చేటట్లు వ్యహరించారన్నారు. ఈ విషయంలో తాడేపల్లి సిఐ, డిఎస్పి వారి దగ్గర డబ్బులు తీసుకుని పక్షపాతంగా వ్యవహరించారని తెలిపింది. అందుకే నాకు అన్యాయం జరిగింది, మంగళవారం నాఇంటి రెండవ తాళం కోసం భర్త ఇంటికి భార్గవ పేటకు వెళ్తే ఆడపడుచు, మరిది, భర్త, అత్త అందరు కలిసి మళ్ళీ తనపై దాడి చేశారని వివరించారు. అందువల్ల మంగళగిరి పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు చేసి ఆందోళన చేశానని, పోలీసులు ఇప్పటికైనా ఈ కేసు విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించి న్యాయం చేయాలని, తాను ఫిర్యాదులో పేర్కొన్న నలుగురిని రిమాండ్ పంపించాల్సిందేనని అప్పటి వరకు తను న్యాయం కోసం పోరాడుతానని మీడియాకు వివరించిఘిది. బాధితురాలి తరపున వచ్చిన మహిళా న్యాయవాది కీర్తి మాట్లాడుతూ బాధితురాలు ఘోరంగా మోసపోయిందని ఫిర్యాదులో మేము పేర్కొన్న రిపోర్టు ఆధారంగా ఎఫ్ఐఆర్‌లో సెక్షన్లు నమోదు చేయలేదని చిన్నచిన్న సెక్షన్లు నమోదు చేసి పది రోజుల్లోనే బెయిల్ వచ్చే వెసులు బాటు నిందుతుడికీ కల్పించారని అందుకే సులువుగా నిందితుడి బయట తిరుగుతున్నాడన్నారు. ఇది సరైన విధానం కాదని ఈ విషయంపై మేము న్యాయం జరిగేదాకా పోరాడతామని వివరించారు.



మీడియాతో మాట్లాడుతున్న బాధిత మహిళ

అణగారిన వర్గాలకు ఉన్నత విద్య దూరం

వేముల రోహిత్ వర్ధంతి కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

యూనివర్సిటీల్లో పరిశోధన విద్యార్థులకు ఫెలోషిప్‌లు నిలిపివేయటం ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దళిత, గిరిజనులకు ఉన్నత విద్యను దూరం చేస్తుందని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి విమర్శించారు. వేముల రోహిత్ ఏడవ వర్ధంతి సభ స్థానిక ఇన్నర్ రింగురోడ్డులోని ప్రగతి నగర్‌లో కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ నల్లపు కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాల్యాద్రి, డిబిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబాబు, సిపిఎం నగర ప్రధాన కార్యదర్శి కె.నళినీకాంత్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి. లక్ష్మణరావు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కంపా వెంకటయ్య మాట్లాడుతూ వేముల రోహిత్ జీవితం మనువాదంపై ఎక్కుపెట్టిన బాణం అని అన్నారు.బిజెపి ఆర్ఎస్ఎస్ విద్యారంగంలో మతోన్మాదాన్ని చొప్పించే ప్రయత్నాన్ని రోహిత్ దీటుగా ఎదుర్కొన్నాడని తెలిపారు. ఖగోళ శాస్త్రంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాల్సిన రోహిత్ కుల వివక్షకు గురై, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మతి చెందటం బాధాకరమన్నారు. రోహిత్ ది ఆత్మహత్య కాదని, వ్యవస్థీకతమైనటువంటి హత్య అని అన్నారు.ప్రశ్నించే వారిని అర్బన్ నక్సలైట్లు వంటి రకరకాల పేర్లతో మేధావులందరినీ జైల్లో పెట్టడం, వేధించటం బిజెపి ఆర్ఎస్ఎస్ చేస్తుందన్నారు.వేముల రోహిత్ చట్టం చేయాలని, రోహిత్ జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు జొన్నకోటి నవీన్ ప్రకాష్, మరియ దాసు, దావీదు వంశీ, చిన్న తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి : వేముల రోహిత్ ఏడవ వర్ధంతి సందర్భంగా మంగళగిరి కెవిపిఎస్ కార్యాలయంలో రోహిత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఎన్ కిషోర్, కెవిపిఎస్ నాయకులు జె నవీన్ ప్రకాష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, జేవీ రాఘవులు, పి బాలకృష్ణ , ఎం చలపతిరావు, జి వెంకయ్య, జీవి ప్రసాద్, ఎస్ గణేష్, గోలి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


రోహిత్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

బాలల్లో మాదకద్రవ్యాల వినియోగం నివారణకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

బాలల్లో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిరోధంపై జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచనల మేరకు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడంపై మంగళవారం కలెక్టరేట్‌లో వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలలు చదువుకునే, నివసించే ప్రాంతాలలోని మెడికల్ షాపులలో, కిరాణా షాపులలో మాదక ద్రవ్యాలు బాలలకు విక్రయించడం నిషేధించటానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలు మొదలైన ప్రాంతాలలోని మెడికల్ షాపులలో, కిరాణా షాపులలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలల సమీపంలోని షాపులలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను పూర్తిగా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, కళాశాలల హెచ్‌ఎంలు వారి సమీప ప్రదేశాల్లో హెడ్ మాస్టర్లు వారి సమీప ప్రదేశాలలోని మెడికల్ షాపులలో, కిరాణా షాపుల వారితో చర్చించి బాలలకు మాదక ద్రవ్యాలు విక్రయించడం నిషేధించటానికి తగు చర్యలు తీసుకొవాలని అదేశించారు. ఎక్స్, హెచ్1 మందుల విక్రయాలను మెడికల్ షాపులలో ప్రత్యేకంగా రిజిస్టర్లు నిర్వహించేలా ఔషద నియంత్రణ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలోని డీ ఎడిక్షన్ సెంటర్‌లో బాలలకు ప్రత్యేకంగా వార్డు ఏర్పాటు చేయాలన్నారు.సమావేశంలో డిఆర్ఓ కె.చంద్రశేఖర్, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ హనుమంతరావు, డిఇఓ పి.శైలజ, జిల్లా ఎక్సయిజ్ అధికారి సుధాకర్‌రెడ్డి, ఔషధ నియంత్రణాధికారి లక్ష్మణ్, సీఐ సీహెచ్‌వీబీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్యశాఖాధికారులతో కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించటానికి వైద్య ఆరోగ్యశాఖలో అమలవుతున్న కార్యక్రమాలు ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించేలా జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్షేత్రస్థాయి అధికారుల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టరు విధానం, ఎన్‌సిడి సర్వే, ఎనీమియా ముఖ్త్ భారత్ కార్యక్రమాల్లో రక్త పరీక్షలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పర్యవేక్షణ కార్యక్రమాలు నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయాల వారీగా ఎఎన్ఎంల పనితీరును పర్యవేక్షించి, అశించిన స్థాయిలో పురోగతిలేని ప్రాంతాలను జిల్లా స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఉద్యోగులు పనితీరు మెరుగుపర్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో నిర్మాణం పూర్తి అయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వారంలోపు ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. హైరిస్క్ గర్భిణీలను సమీపంలో జిల్లా ఆసుపత్రులలో చేర్పించేందుకు ఖచ్చితంగా 108 గానీ, టాక్సీలనే వినియోగించాలని, రవాణా ఖర్చుల కోసం పీహెచ్‌సిలకు ప్రభుత్వం నగదు సైతం మంజూరు చేస్తుందన్నారు.అలాగే ఆయూష్మాన్ భారత్, పీఎంజీ కార్డుల ఈకేవైసీ వాలంటీర్ల ద్వారా వెంటనే పూర్తి చేయించాలన్నారు. వైద్య,ఆరోగ్యశాఖలోని పథకాలు, వివిధ కార్యక్రమాలు అమలు చేయటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే క్షేత్రస్థాయి ఉద్యోగులు, పర్యవేక్షణ అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ హనుమంతరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, ఎన్‌సిడి పీడీ డాక్టర్ శ్రావణబాబు, డీఐఓ డాక్టర్ కెవీ సుబ్బరాయన్, డీపీఎం డాక్టర్ రత్నమన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.